## కథ

# నివేదన

**తమిరిశ జానకి**

**ఇన్నేళ్ల తర్వాత ఆ ఊరు వెళ్తానని గానీ, అసలు వెళ్లాల్సొస్తుందని గానీ ఎప్పుడూ అనుకోలేదు. నా హైస్కూల్ చదువు వరకూ ఆ ఊళ్లోనే సాగింది. నర్సాపురంలో ఇంటి పక్కన అర ఫర్లాంగు దూరంలో గోదావరి. గోదావరి ఒడ్డున కొండాలమ్మగుడి.**

ఎంతబాగుండేవి ఆ రోజులు. స్నేహితుడు శీనుతో కల్సి ప్రతీరోజూ కొంతసేపు గోదావరి ఒడ్డున కూచుని వచ్చేవాడిని. హైస్కూల్ చదువు పూర్తయ్యేసరికి నాన్నగారు పోవటం, అమ్మా నేనూ, మావయ్య వాళ్ల ఊరెళ్లిపోవటం జరిగింది. వాళ్లింటి పక్కనే అద్దెకి ఇల్లు దొరికింది.

ఇల్లంటే రెండు వాటాలున్న డాబా ఇంట్లో ఒక వాటాలోకి చేరడం జరిగింది. నన్ను కాలేజ్‌లో చేర్చాలా వొద్దా అన్న తర్జనభర్జనలు జరిగాయి పెద్దవాళ్ల మధ్య. చదువులో తెలివితేటలుండి బాగా చదువుకుంటున్నవాడిని మానిపించడం అమ్మ కిష్టం లేకపోయిందనుకుంటాను. కాలేజ్‌లో చేర్పించింది.

బి.కాం. పూర్తవ్వగానే ఉద్యోగం దొరికింది. ఉద్యోగంలో చేరి కూడా పదేళ్లయిపోతోంది. అంటే.. నర్సాపురం వొదిలిపెట్టి పదిహేనేళ్లయిపోయింది.. అప్పట్నించీ ఇంతవరకూ మళ్లీ అటు వైపు వెళ్లే అవసరం గానీ, అవకాశం గానీ రాలేదు. నాలుగైదేళ్లుగా పెళ్లెప్పుడు చేసుకుంటావురా సంబంధాలొస్తున్నాయి అంటూ పాట పాడుతూనే ఉందమ్మ.

ఉద్యోగంలో ప్రమోషన్ల కోసం పరీక్షలకి చదవడం రాయడం, అంచెలంచెలుగా పైకి వెళ్లడం ఈ ధ్యాసలో పెళ్లిని గురించిన ఆలోచన వెనక్కిపెట్టటం జరిగింది. ముప్ఫయ్యోపడిలో పడ్డావు. ఇంకా ఎప్పుడురా పెళ్లి చేసుకునేదంటూ ఈమధ్య రోజుకోసారి మంత్రంలా అమ్మ చదువుతుంటే అది నిజంగానే మంత్రంలా పనిచేసినట్టుంది, ఆలోచన అటు పెట్టాను కాస్త.

ఇప్పుడు నా కొలీగ్ శివరావు పెళ్లికి వెళ్లబోతున్నాం అమ్మా నేనూ. అమ్మతో కూడా బాగా పరిచయం శివరావుకి. అందుకే అమ్మతో కూడా స్వయంగా చెప్పాడు పెళ్లికి తప్పకుండా రావాలని. తీసుకురాక పోతే ఊరుకోనని హెచ్చరించాడు నన్ను. ఇన్నేళ్ల తర్వాత సందర్భం వొస్తే తీసికెళ్లకుండా ఉంటానా ఆ ఊరు?

ఊళ్లో అడుగుపెడుతుంటేనే అమ్మ మొహంలో వెలుగు, కళ్లల్లో మెరుపు పసిగట్టాను.

అలాగే నా కళ్లల్లో మెరుపు అమ్మ కనిపెట్టే ఉంటుంది. పలకరింపులూ స్నానాలూ, కాఫీ టిఫిన్లూ అన్నీ అయ్యాయి. ముహూర్తం రాత్రికి, కాసేపు అమ్మవారి గుడికి వెళ్లొద్దామంది అమ్మ. ఈ ఊళ్లో ఉండే రోజుల్లో చాలా తరచుగా వెళ్లేది అమ్మ కూడా ఆ గుడికి. శివరావుతో చెప్పి అమ్మని తీసుకుని బయల్దేరాను సైకిల్ రిక్షాలో.

గుడి, గుడి పరిసరాలు అప్పటికీ ఇప్పటికీ చాలా అభివృద్ధి చూపిస్తున్నాయి. ఎంతో బావుంది మనసుకి ఆ ప్రాంతంలో అడుగు పెట్టగానే. దానిక్కారణం చిన్ననాటి జ్ఞాపకాలు మల్లెల సౌరభంలా మనసుని ముంచెత్తడమేనని క్షణాల్లో అర్థమైంది. చిన్నతనంలో గడిపిన ఊరంటే ఎవర్కైనా అపురూపమే అనిపిస్తుంది.

''ఏవుందనీ ఆ ఊళ్లో? అంత సంతోషపడిపోతున్నావు?'' మరో కొలీగ్ మొన్న అడిగిన ప్రశ్న గుర్తొచ్చింది. అతను పెళ్లికి రాలేనన్నాడు.

''ఆ ఊళ్లో నేనొదిలేసిన తియ్యటి జ్ఞాపకాలూ, నాన్నని కోల్పోయిన చేదు నిజం రెండూ ఉన్నాయి. మనిషినప్పుడప్పుడు తట్టి లేపేందుకు ఆ రెండు రుచులూ గతం రూపంలో వర్తమానంలోకి వొస్తూ ఉండాలనుకుంటాను.''

''అమ్మో! ఏవో పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నావు. అసలు మామూలు మాటలే నా మట్టి బుర్రలోకి అంత తొందరగా వెళ్లవు. ఇంక కవిత్వంలో నువ్వు మాట్లాడితే కంగారుపడతాన్నేను.''

''ఏవిట్రా నీలో నువ్వే నవ్వుకుంటున్నావు?'' అమ్మ ప్రశ్నలతో నా ఆలోచన్లకి ఫుల్‌స్టాప్ పడింది.

దైవదర్శనం అయ్యాక ఇద్దరం గోదావరి ఒడ్డున గట్టుమీద కూచున్నాం. నీటిమీద వొస్తున్న గాలి చల్లగా సేదదీరుస్తుంది. నదిలో తేలియాడే అలలు చూస్తూ ఎంత సేపైనా కూచోవచ్చు.

''శీనువాళ్లు ఈ ఊళ్లో లేరన్నావు కదూ?''

''ఔనమ్మా... ఉంటే ఈపాటికి వాళ్లింటికి వెళ్లకుండా ఉంటానా?''

''ఒరేయ్! అటు చూడు.''

''ఏంటమ్మా?''

''అలా వెళ్తున్నారు చూడు పెద్దాయనొకాయన. తెల్లచొక్కా తెల్లపంచె..'' అమ్మ చూపించిన వైపు చూశాను.

బాగా పరిచయం ఉన్న మొహంలాగే అనిపించింది. ''ఆ.. రామారావు మాస్టారు.. అలా అయిపోయారేంటి?''

''ఏదో జబ్బు చేసిన మనిషిలా ఎలా అయిపోయారో?''

''మనం ఈ ఊర్నించి వెళ్లేటప్పటికే యాభై ఏళ్లు దాటాయి ఆయనకి. అయినా ఈ రోజుల్లో డెబ్బయ్యేళ్లొచ్చినా వృద్ధాప్యం వొచ్చేసినట్టు కాదనుకో. కానీ పాపం.. మొదటి నుంచీ కూడా ఆయనకి కుటుంబ భారం, ఇబ్బందులు ఎక్కువ. చాలా కష్టాలు పడ్డ మనిషాయన. నువ్వప్పుడు చిన్నకుర్రాడివి కదా, నీకు తెలియదు.''

''మాస్టార్ని పలకరించి వొస్తాను'' లేవబోతుంటే చిన్నగా అంది అమ్మ ఉండమని.

''ఇప్పుడాయన వెళ్లిపోతున్నారు కదా! ఇక్కడ పలకరించేసి ఊరుకోడం కాదు. పళ్లూ స్వీట్లూ కొని ఇంటికి తీసుకెళ్లి ఇచ్చి కొంచెంసేపు మాట్లాడిరా. అది మర్యాదగా ఉంటుంది.''


''అమ్మో! తెలుగు పంతులుగారితో కొంచెంసేపు కబుర్లు చెప్పి రావడమా?'' తెలుగు అన్న మాటని ఒత్తిపలుకుతూ గుండెమీద చెయ్యేసుకున్నాను. నేను, మరికొందరు కల్సి ఆయన్ని ప్రతీ క్లాసులోనూ ఏడిపించేవాళ్లం.

''ఎందుకురా అంత భయం?''

''ఎప్పుడూ ఆయన్ని అతిగా వేళాకోళం చేసి ఏడిపిస్తూ ఉండేవాడినమ్మా నేను'' వినకూడనిదేదో విన్నట్టుగా నావైపు చూసిందమ్మ. ఆ కళ్లు బాధని వ్యక్తం చేస్తున్నాయి. స్పష్టంగా తెలుస్తోంది.

చిన్నగా నిట్టూర్చి చెప్పింది. ''ఆయనకి నలుగురు చెల్లెళ్లు. తల్లి, పిల్లల చిన్నతనంలోనే పోయింది. తండ్రికి ఇల్లూ పిల్లలూ పట్టేది కాదు. అందుకని తనే చెల్లెళ్లకి ఆప్యాయతా ఆపేక్షలు పంచి ఇచ్చి పెంచి పెద్ద చేసి పెళ్లిళ్లు చేశాడు. వాళ్లందరి పెళ్లిళ్లూ అయ్యేదాకా తన పెళ్లిమాటే తలపెట్ట

లేదు. చాలా ఆలస్యంగా పెళ్లి చేసుకున్నాడు. ఓర్పు సహనానికి మారుపేరనేవారు ఆయన్ని. తెలుగుకి పండితుడే గానీ తినడానికి కడుపునిండా తిండి ఉండేది కాదాయనకి. అర్థాకలితో స్కూల్‌కొచ్చి ఓపిగ్గా మీకు పాఠాలు బోధిస్తుంటే ఎగతాళి చేసి ఏడిపించేవాడివా? మనిషి విలువ తెలియకుండా ప్రవర్తించేవాడివన్నమాట. అసలు ఏ మాస్టారినైనా ఎందుకు ఎగతాళి చెయ్యాలి?''



''అమ్మా! ఎప్పుడో జరిగిన దానికి ఇప్పుడు క్లాసు తీసుకోవడం అన్యాయం కదమ్మా?''

''ఏం చెయ్యమంటావ్? నాకు తెల్సిందిప్పుడేగా మరి? ఈ ఊర్నించి మనం వెళ్లిపోయేటప్పుడు నలుగురూ నాకిచ్చిన సలహా ఏవిటో తెల్సా?''

''ఏవిటి?'' కుతూహలంగా చూశాను చెప్పమన్నట్టు.

''అందరూ కూడా నిన్నింక చదివించొద్దని, ఏదో ఓ పన్లో పెట్టెయ్యమని సలహా ఇచ్చారు. మీ మావయ్య కూడా అక్కడికెళ్లాక అదే అన్నాడు. ఇక్కడ తెలుగు మాస్టారొక్కడే మంచి సలహా చెప్పారు. బాగా చదివే పిల్లాడినప్పుడు చదువు మానిపించకండి. కనీసం డిగ్రీ చెయ్యనివ్వండి అన్నారు.''

''నిజమా అమ్మా? ఆయన చెప్పారా?'' ఆశ్చర్యంగా చూశాను.

''క్లాసులో అందరికంటే ఎక్కువగా నేనే ఏడిపిస్తూ ఎగతాళి చేస్తుండేవాడిని ఏదోవిధంగా. తెలుగువాడ్నై ఉండి తెలుగంటే లోకువగా ఉండేది నాకు. నేనెంత పూలిష్‌గా ప్రవర్తించినా నామీద కోపం పెట్టుకోలేదన్నమాట ఆయన. నా భవిష్యత్తు గురించే ఆలోచించారు.''

★ ★ ★

పళ్లూ స్వీట్లూ కొని తీసుకొని మాస్టారింటికి వెళ్లాను. నేను చదివిన హైస్కూల్ వీధిలోనే ఎత్తు అరుగుల ఇల్లు మాస్టారు వాళ్లది. ఆ వీధి పేరు చెప్పి మాస్టారి పేరు చెప్తే సరిగ్గా ఆ ఇంటిగుమ్మంలో ఆపాడు రిక్షావాడు.

చిన్నగా తలుపుమీద కొట్టాను. ఒక్క నిమిషంలో తెరుచుకుంది తలుపు. తలుపు తీసిన అమ్మాయి ఎవరూ అన్నట్టుగా చూసింది నా మొహంలోకి. సుమారు పాతికేళ్లుంటాయేమో! తెల్లగా సన్నగా నాజుగ్గా సన్నజాజి మొగ్గల్లే ఉంది. నెమ్మదిగా అడిగాను ''మాస్టారున్నారాండీ?''

''ఉన్నారు రండి. కూచోండి'' కుర్చీ చూపించి లోపలికి వెళ్లింది. మరో నిమిషంలో మాస్టారివతలికొచ్చారు. నేను లేచి నిలబడి చేతులు జోడించాను.

''కూచో బాబూ!'' గోడవారగా ఉన్న పాత చెక్క కుర్చీలో ఆయన కూచున్నారు.

''మాస్టారూ నేను విశ్వనాథాన్ని. ఒకప్పటి మీ స్టూడెంటుని.''

సాలోచనగా చూశారు. గుర్తుకు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నట్టు అర్థమైంది.

''మా నాన్నగారు పోయాక అమ్మా నేనూ, మావయ్య వాళ్ల ఊరెళ్లిపోయాం.''

ఆయన పెదాలమీద చిరునవ్వు తొణికి నేను గుర్తొచ్చానని తెలియజేసింది.

''నువ్వా బాబూ! అప్పటికీ ఇప్పటికీ చాలా మారిపోయావు కదా. వెంటనే గుర్తుపట్టనందుకు ఏమీ అనుకోకు నాయనా విశ్వనాథం. ఈ

ఊర్నించి వెళ్లేటప్పటికి చిన్నకుర్రాడివి కదా? ఆ రూపమే నా మనసులో నిలిచిపోయింది. గుర్తుపెట్టుకుని వొచ్చావు. చాలా సంతోషం బాబూ. మీ అమ్మగారెలా ఉన్నారు?''

''బాగానే ఉందండీ...''

''ఎంతవరకూ చదివావు? ఏం చేస్తున్నావు?''


నా చదువు, ఉద్యోగ వివరాలన్నీ చెప్పాను.

మనస్ఫూర్తిగా సంతోషించారు మాస్టారు. ''పిల్లలు వృద్ధిలోకి రావడం కంటే సంతోషం, నిశ్చింత మరేమీ ఉండవు తల్లిదండ్రులకి. అలాగే శిష్యులు పైకొస్తే అంతకంటే ఆనందం, తృప్తి మరేముంటాయి గురువులకి? అమ్మగార్ని కూడా తీసుకురాకపోయావా?'' అడుగుతూనే లోపలకి చూస్తూ చిన్నగా-

''అమ్మా! సుజాతా కాఫీ తీసుకురామ్మా'' కేకేశారు.

## 'వీధి'లో గోపిక

**వీధిలో ఉండి గోపిక పిలిస్తే ఇక కృష్ణుల ఆనందానికి హద్దు ఏముంటుంది చెప్పండి? 'నా ఆటోగ్రాఫ్ స్వీట్‌మెమొరీస్' హీరోయిన్ గోపిక ఇప్పుడు ఉషాకిరణ్‌మూవీస్ కొత్త చిత్రం 'వీధి'లో నటిస్తోంది. చాలాకాలం నుంచి సినిమా నిర్మాణానికి దూరంగా ఉన్న ఈసంస్థ ఈ మధ్య ఈ చిత్రం షూటింగ్‌ని పూర్తిచేసింది. శర్వానంద్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం తనకి మంచి బ్రేక్‌నిస్తుందని భావిస్తోంది అందాలజవ్వని గోపిక.**



''అమ్మ కూడా వొచ్చిందండీ. నా కొలీగ్ శివరావు పెళ్లికొచ్చాం. ఆడపెళ్లివారు ప్రస్తుతం ఈ ఊళ్లో ఉంటున్నారుట. అందుకని పెళ్లి ఈ ఊళ్లో చేస్తున్నారు. పెళ్లికూతురు తండ్రి ట్రాన్స్‌ఫర్ మీద ఈమధ్య ఈ ఊరొచ్చిన ప్రభుత్వ ఉద్యోగి సాంబమూర్తిగారుట. ఈరోజు రాత్రి ముహూర్తం. రేపు వెళ్లిపోతాం.''

''సాంబమూర్తిగారింట్లో పెళ్లికొచ్చారా? మంచిది బాబూ. మంచి కుటుంబం వాళ్లది. పెళ్లికొడుకు కుటుంబం కూడా మంచివాళ్లు'' శివరావు వాళ్లు మాస్టారికెలా తెలుసు? అడుగుదామనుకునే లోపల బయట ఎవరో పిలవడంతో మాస్టారు అటు వెళ్లారు. అయిదు నిమిషాల తర్వాత ఆయన రావడం, వారమ్మాయి కాఫీ తీసుకురావడం ఒకేసారి జరిగాయి.

తలుపు తీసిన సన్నజాజి మొగ్గే ఆమె.

''తీసుకో బాబూ కాఫీ''

ఆమెకి నన్ను పరిచయం చేశారు. ''ఇన్నాళ్లకి మళ్లీ వచ్చాడు. నన్ను గుర్తుపెట్టుకుని చూడటానికొచ్చాడమ్మా'' మాటల్లో సంతోషం తొణికిసలాడింది.

చేతులు జోడించింది ''నమస్కారం.''

ప్రతినమస్కారం చేసేందుకు చేతిలో కాఫీ కప్పు. నోటితోనే చెప్పి తల ఊపాను. మంచీ మర్యాదా అణకువా వినయం ప్రశాంతత అన్నీ ఆమె మొహంలోనూ కళ్లల్లోనూ ప్రస్ఫుటంగా కనిపించాయి నాకు. ఇంక శివరావు గురించి అడగడమే మర్చిపోయాను మాస్టార్ని. విడిదింటికి వెళ్తూనే ముందు పెళ్లికొడుకు దగ్గరకి నడిచాను. పక్కన ఎవరూ లేరు. మంచిదే.

''వచ్చావా? ఎక్కడికెళ్లిపోయావు?''

''మాస్టార్ని కలుద్దామని వెళ్లాను.''

''ఏ మాస్టారు?''

''నేను హైస్కూల్లో చదివేటప్పుడు తెలుగు చెప్పేవారు. రామారావు మాస్టారు.''

''ఓ...ఆయనా?''

''ఆయన నీకెలా తెల్సు? నువ్వీ ఊరు రావడం ఇదే మొదటిసారి కదా?''

''ఇదే మొదటిసారి కాదులే. ఇది మూడోసారి. మొదటిసారి ఆ మాస్టారి రెండో కూతురు.. పేరు.. ఆ.. సుజాత.. ఆ అమ్మాయిని పెళ్లిచూపులు చూడటానికొచ్చాను. రెండోసారి ఆ అమ్మాయితో పెళ్లి నిశ్చితార్థం చేసుకోడానికొచ్చాను. ఇది మూడోసారి.''

''అదేవిటి? ఆ అమ్మాయితో నిశ్చితార్థం చేసుకున్నానంటున్నావు. మరి ఇంకో అమ్మాయితో పెళ్లి?'' వింతగా చూశాను.

''ఎందుకంత ఆశ్చర్యపోతావు? అమ్మాయి బంగారబ్బొమ్మలా ఉందని ఆ సంబంధానికి ఒప్పుకుని నిశ్చితార్థం కూడా చేసుకున్నమాట వాస్తవం. పెద్దకూతురు ఒక్కదానికీ పెళ్లి చేసేటప్పటికే తాతలు దిగొచ్చారట ఆ పెళ్లికి. వాళ్లావిడ వైద్యానికి చేసిన అప్పుల్లో తలమునకలై ఉన్నాడాయన. ఈ ఆఫీసరు కూతురు సంబంధం వొచ్చేసరికి ఆలోచించాను. బతకలేక బడిపంతులు సంబంధం క్యాన్సిల్ చేసేశాను.''

తెల్లబోవడం నావంతయింది. ఏ బస్ టిక్కెట్టో రైలు టిక్కెట్టో క్యాన్సిల్ చేసుకున్నట్టుగా ఎంత తేలిగ్గా చెప్తున్నాడు. మరి మాస్టారు ఇంత జరిగినా ఒక్క చెడ్డమాట చెప్పలేదు వీళ్ల గురించి... చిన్నప్పుడు తెలుగు నేర్చుకోడానికి ఏడ్చాను. అది చాలా తప్పే. తెలుగు మాస్టార్ని ఏడిపించాను. అది మరీ మరీ పెద్దతప్పే. ఇప్పుడు సాటి తెలుగు మిత్రుడిని చూసి వీడు నా మిత్రుడా అని సిగ్గుపడుతున్నాను. ఇది మాత్రం తప్పు కాదు.

★ ★ ★

అమ్మతో నా నిర్ణయం చెప్పాను.

చాలా సంతోషించింది అమ్మ.

మర్నాడు పొద్దున్నే అమ్మని తీసుకుని మాస్టారింటికి మళ్లీ వెళ్లాను.

అమ్మ, నేను ఇద్దరం ఆ తండ్రీ కూతుళ్లతో మాట్లాడాం.

మా నర్సాపురం ప్రయాణానికి మాకొక ప్రయోజనం, సాఫల్యత చేకూరినట్టనిపించింది నాకూ అమ్మకి.

సుజాత మా ఇంటి కోడలిగా రావటానికి ఒప్పుకోవటం మా అదృష్టం. నర్సాపురానికీ మాకూ సంబంధం తెగిపోలేదు... మరింత బలపడింది. గోదావర్లో బోట్ షైర్ చిన్నప్పుడెప్పుడో చేశాను. ఇంక ముందు ముందు మళ్లీ మళ్లీ చేస్తాను.

సుజాత నాతో మాట్లాడిన మాటలు తేనెల తేటల తెలుగులా అనిపించింది నాకు. ఆమె వ్యక్తిత్వం, మాస్టారి వ్యక్తిత్వం- అంతెత్తున ఉన్న తెలుగు తల్లి మెడలోని మల్లెపూలదండలా తోచాయి.

శివరావు లాంటి మనస్తత్వం ఉన్నవాళ్ల మూలంగా తీయ తేనియ తెలుగు లాంటి వ్యక్తిత్వాలకి నష్టమేమీ వాటిల్లదు.. వాటిల్లకూడదు.. ఔను.. గోదావరి తల్లికీ నా తెలుగు తల్లికీ.

నేను నివేదించుకునే నివేదన ఇదే.